

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 22-10-2025 సంపుటి : 07 సంచిక : 163 పేజీలు : 8 వెల : రూ 3-00

## అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న భారత్: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 21: భారతదేశం.. ఆపరేషన్ సిందూర్ ద్వారా ధర్మాన్ని పాటించడమే కాకుండా ప్రతీకారం సైతం తీర్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత జరుగుతున్న రెండో దీపావళి వేడుకలు ఇవి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు మనకు బోధించారని.. అలాగే అన్యాయాన్ని ఎదరించడానికి ధైర్యాన్ని సైతం ఇచ్చారని చెప్పారు. అందుకు ఈ ఏడాది మేలో జరిగిన ఆపరేషన్ సిందూరు ద్వారా ఇది నిరూపితమైందని ప్రధాని మోదీ వివరించారు.అదీకాక ఈ దీపావళి వేళ దేశంలోని మారుమూల జిల్లాల్లో సైతం దీపాలు వెలిగించి పండగ చేసుకున్నారని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం, మావోయిస్టులను దాదాపుగా నిర్మూలించామని.. అందువల్లే ఇది సాధ్యమైందని వివరించారు. చాలా మంది మాజీ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి.. రాజ్యాంగంపై నమ్మకంతో అభివృద్ధికి దోహదపడుతున్నారని చెప్పారు.దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగం గా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడం తోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుంద న్నారు.ఒక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాల ని సూచించా రు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు. చమురు వినియోగాన్ని దాదాపు 10 శాతం తగ్గించాలని.. మెరుగైన ఆరోగ్యం కోసం యోగా చేయాలని ప్రజలకు ఆయన సూచించారు. ఇక దీపావళికి సరికొత్త అర్థాన్ని ప్రధాని మోదీ తెలిపారు. ఒక దీపం మరో దీపం వెలిగించినప్పుడు.. కాంతి మరింత బలంగా పెరుగుతుం దన్నారు. ఈ దీపావళి పండగ సంద ర్భంగా సమాజంలో సామరస్యం, సహకారంతోపాటు సానుకూలతను విస్తరింప చేయాలని ప్రజలను ప్రధాని మోదీ కోరారు




## కోనసీమ పేలుడు ఘటన..

అమరావతి: అంబేద్కర్ కోనసీమ జిల్లా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన హోం మంత్రి అనిత, అధికారులు సురేష్, ఆకే రవికృష్ణ బాణసంచా పేలుడు ఘటనకు సంబంధించిన నివేదికను సీఎంకు అందించారు. ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు మెటీరియల్ మాన్యుఫాక్చరింగ్ చేశారని, హార్డ్ మెటీరియల్ వాడటం వల్లే స్పార్క్ వచ్చి, మాన్యుఫాక్చరింగ్ జరుగుతున్న ప్రాంతంపై పడిందని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఏ మాత్రం నిబంధనలు పాటించలేదని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.ఎక్స్ ప్లోజివ్ మెటీరియల్ పై నియంత్రణ కోసం ఇక నుంచి ఆన్ లైన్ ద్వారానే కొనుగోళ్లు జరిగేలా చూడాలన్న ముఖ్యమంత్రి బాణసంచా కోసం ఉపయోగించే పదార్థాల కొనుగోళ్లు, తయారీపై పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం లేని తయారీ కేంద్రాలను, ఆథరైజేషన్ లేని వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని సీఎం పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. బాణసంచా తయారీ కేంద్రాలన్నీ నిబంధనల ప్రకారమే ఉండాలన్నారు. అలాగే, పనిచేసే వారికి వ్యక్తిగత బీమా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఏపీకి గూగుల్.. తమిళనాడులో రచ్చపై స్పందించిన మంత్రి లోకేష్..

గూగుల్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. గూగుల్ కంపెనీ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. కొద్దిరోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైజాగ్‌ను అద్భుతమైన నగరం అంటూ ప్రశంసలు కురిపించారు. అయితే, ఏపీలో గూగుల్ కంపెనీ డేటా సెంటర్ ఏర్పాటు చేయటంపై తమిళనాడులో రచ్చ మొదలైంది.అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకేల మధ్య రచ్చ జరుగుతోంది. రెండు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. సుందర్ పిచాయ్ తమిళ వ్యక్తి అయినప్పటికీ గూగుల్ పెట్టుబడులను ఏపీలో పెడుతున్నాడని, స్టాలిన్ సర్కార్ పెట్టుబడులు తేలేకపోయిందని ఏఐఏడీఎమ్‌కే విమర్శలు చేస్తోంది. తమిళనాడులో జరుగుతున్న ఈ రచ్చపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశారు.ఆ వీడియోలో ఏఐఏడీఎంకే నాయకుడు మాట్లాడుతూ.. 'గూగుల్ కంపెనీ ఆంధ్రాలో పెట్టుబడులు పెడుతోంది. ఆ గూగుల్ కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ మన మధురైకి చెందిన వాడు. ప్రభుత్వం గూగుల్‌కు అవకాశం ఇచ్చి ఉంటే మన రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేవి' అని అన్నారు. దీనిపై అధికార పార్టీ నాయకుడు స్పందిస్తూ..'జయ లలిత నిర్లక్ష్యం కారణంగానే చాలా కంపెనీలు ఆంధ్రాకు వెళ్లిపోయాయి'

## అమరవీరుల సేవలు మరువలేనివి

### కలెక్టర్ రాజకుమారి గినియా, ఎస్పీ సునీల్ షెరాన్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21--విధి నిర్వహణలో ప్రాణాలను తృణప్రాయంగా భావించి ప్రజల శ్రేయస్సుకై ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా. జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయం నందు మంగళవారం జరిగిన అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.?కార్యక్రమానికి అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి అమ్మన్నరాజు కూడా హాజరయ్యారు. ముందుగా పెరేడ్ కమాండర్ జి.బాబు వద్ద నుండి కలెక్టర్, ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు విధి నిర్వహణలో మరణించిన వారి వివరాలను తెలియజేశారు.?కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూసమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ అమరులైన పోలీసు వీరులను స్మరించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. పోలీసు ఉద్యోగం అత్యంత కష్టతరమైనదని, ఎండ, వాన, చలి తేడా లేకుండా అనునిత్యం విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, సైబర్ క్రైమ్‌ను నియంత్రించడంలో సాంకేతికతను వినియోగించుకోవడం, ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికతో పరిష్కరించడం పోలీసులకు సవాలుగా ఉంటుందని వివరించారు. జిల్లాలో ఏడాది నాలుగు నెలల పాటు తాను సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి పోలీసులు అందించిన సహకారాన్ని కొనియాడారు.??ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూపోలీసులు ప్రతిరోజు కుటుంబానికి దూరంగా ఉండి, ఎండ, వాన, చలి తేడా లేకుండా విధులు నిర్వహించడం చాలా కష్టతరమైనదని తెలిపారు. సమాజంలో భయభ్రాంతులకు గురిచేసే సంఘవిద్రోహ శక్తులను అరికట్టేందుకు, శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసులు చేసే సేవ అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు రోజుల ముందు విధి నిర్వహణలో అమరుడైన హైదరాబాద్ కానిస్టేబుల్‌ను గుర్తుచేసుకున్నారు.?1959 అక్టోబరు 21న భారత్-చైనా సరిహద్దు లధఖ్లోని హాట్ స్ప్రింగ్ వద్ద చైనా చొరబాటుదారుల దాడిలో వీరమరణం పొందిన 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.?అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి అమ్మన్నరాజు మాట్లాడుతూవిధి నిర్వహణలో అమరులైన పోలీసు సోదరులను స్మరించుకోవడం, వారి కుటుంబ సభ్యులను సన్మానించడం గర్వకారణమన్నారు. దేశ రక్షణలో సైనికులు, ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ వారు సుఖంగా నిద్రించడానికి భరోసా కల్పిస్తున్నది మన పోలీసు సోదరులే అని అన్నారు. సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేటి సమాజంలో ఒత్తిడికి గురవుతూ విధులు నిర్వహించడం అత్యంత కష్టతరమైనదన్నారు.?అనంతరం ముఖ్య అతిథులు అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# సంపాదకీయం

బుధవారం 22-10-2025

## బ్రహ్మోస్ దబిడిదిబిడే

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత శక్తి ప్రపంచానికి తెలిసింది. ఇదే సమయంలో మిత్రులు ఎవరో.. శత్రువులు ఎవరో భారత్‌కు అర్థమైంది. మన చుట్టూనే శత్రువులు ఉన్నారని గుర్తించిన భారత్.. ఆయుధాల తయారీపై దృష్టి పెట్టింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో సరికొత్త టెక్నాలజీతో ఆయుధాలు రూపొందిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోసించిన బ్రహ్మోస్ క్షిపణిని మరింత శక్తివంతంగా మారుతోంది. శబ్ద వేగాన్ని మించిపోయే బలమైన సూపర్‌సోనిక్ మిసైల్ ఇది. శత్రు శిబిరాలను క్షణాల్లో ధ్వంసం చేసే దీనిది ప్రత్యేకత. ఇప్పుడు భారత రక్షణ శాస్త్రవేత్తలు దాని దూరప్రయాణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశలో ముందుకెళ్తున్నారు.ప్రస్తుతం ఉన్న 450 కిలోమీటర్ల పరిధిని 800 కిలోమీటర్లకు విస్తరించేందుకు పరీక్షలు జరుగుతున్నాయి. కొత్త వేరియంట్‌ను 2027 నాటికి సైనిక వినియోగంలోకి తెచ్చేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. దాదాపు అన్ని హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్లు పూర్తయి, ఇప్పుడు ఎలక్ట్రానిక్ నావిగేషన్ సిస్టమ్ పరీక్షల దశలో ఉంది. ఈ పరీక్షలు విజయవంతమైతే, బ్రహ్మోస్ ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన ఎయిర్?టు?సర్ఫెస్ ఆయుధాలలో ఒకటిగా మరింత స్థానం సంపాదిస్తుంది.సముద్ర ఆధారిత బ్రహ్మోస్ వెర్షన్‌తో మొదట ఈ సాంకేతిక రూపాంతరం మొదలుకానుంది. నౌకాదళానికి ఉపయోగించే ఫైర్ కంట్రోల్ సిస్టమ్, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ఆధారంగా రేంజ్ పెంపు సాధ్యమవుతుందని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్మీ వేరియంట్‌ను తరువాత, చివరగా వాయుసేనకు అనువైన మోడల్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇదే సమయానికి ఆయుధ మోడ్యూల్‌లో పెద్దగా మార్పులు చేయకుండా సామర్థ్యం పెంపు సాధనమే ప్రధాన లక్ష్యంగా ఉంది.ఇక గగనతలంలో భవిష్యత్ యుద్ధానికి సిద్ధమవుతూ, "అస్త్ర" సిరీస్ క్షిపణుల శక్తివృద్ధి వేగంగా సాగుతోంది. అస్త్ర మార్క్?2 పనితీరును 160 నుంచి?280 కిలోమీటర్ల దూరం వరకు విస్తరించనున్నారు. కొత్త రామ్‌జెట్ ఇంజిన్‌తో నిర్మితమవుతున్న అస్త్ర మార్క్?3 350 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉండనుంది. ఈ క్షిపణులు బియాండ్ విజువల్ రేంజ్ యుద్ధ పరిస్థితుల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. భారత వాయుసేన, సుఖోయ్?30 ఎంకేఐ, తేజస్ యుద్ధవిమానాల్లో వీటిని అమర్చే ప్రణాళికలో ఉంది.ఈ కొత్త పరిణామాలతో భారత్‌కి విదేశీ దిగుమతులపై ఆధారపడే అవసరం తగ్గనుంది. రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్‌ల వంటి దేశాల నుంచి బీవీఆర్ ఆయుధాల దిగుమతి తగ్గి, స్వదేశీ అభివృద్ధికి బలం చేకూరుతుంది. దీని వల్ల భారత్ 'రక్షణాత్మక స్వయం సమృద్ధి' దిశగా మరొక అడుగు ముందుకేసినట్లవుతుంది.ఈ మధ్య అమెరికా అండ చూసుకొని పాకిస్తాన్ రెచ్చిపోతుంది. పాకిస్తాన్ దేశంలో విస్తారమైన వనరులను అమెరికా కంపెనీలకు కట్టబెట్టడం ఇటీవల విజయవంతంగా పూర్తయింది. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఇటీవల అమెరికాలో పర్యటించారు. ఆ సమయంలో పాకిస్తాన్ దేశంలో లభ్యమవుతున్న అరుదైన వనరులను తవ్వే బాధ్యత అమెరికా కంపెనీలకు అప్పగిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. అందువల్లే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయనతో లంచ్ చేశారు. శ్వేత సౌధంలో ఏకాంతంగా మాట్లాడారు. ఆ తర్వాత పాకిస్తాన్ దేశాన్ని గొప్పగా కీర్తించారు. అమెరికా కంపెనీలు పాకిస్తాన్ దేశంలో అడుగుపెడితే చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే సామ్రాజ్యవాదానికి అమెరికా బలమైన ఉదాహరణ. అటువంటి అమెరికా పాకిస్తాన్లో అడుగుపెడితే.. ఏ ఒక్క సహజ వనరును కూడా వదిలిపెట్టకుండా తవ్వుకొని తీసుకెళ్తుంది. ఇంత బిచ్చం మొహం మీద వేసినట్టు.. పాకిస్తాన్ చేతిలో చిల్లర వేస్తుంది.అమెరికా కంపెనీలు వస్తుండడం.. ట్రంప్ నుంచి బలమైన వర్తమానం అందడంతో పాకిస్తాన్ ఆనందానికి అవధులు లేవు. అందువల్లే మనతో యుద్ధం చేస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. న్యూక్లియర్ బాంబులు ఉన్నాయని.. తమను రెచ్చగొడితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని హెచ్చరిస్తోంది. అంతేకాదు సింధు నది మీద భారత్ కడుతున్న ప్రాజెక్టులను నేలమట్టం చేస్తామని వార్నింగులు కూడా ఇస్తోంది.. వీటికి సరైన స్థాయిలోనే భారత్ బదులు చెప్పింది. తిక్క తిక్క వేషాలు వేస్తే తోకలు కత్తరిస్తామని హెచ్చరించింది. ఇంకోసారి ఇలాంటి లేకి మాటలు మాట్లాడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని గట్టు స్వరంతోనే కౌంటర్ ఇచ్చింది. అయితే ఇప్పుడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాకిస్తాన్ కు మరోసారి గట్టి హెచ్చరికలు పంపారు. ఈసారి ఏకంగా భస్మీ పటలం చేస్తామని డెడ్లీ వార్నింగ్ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో రూపొందించిన తొలి విడత బ్రహ్మోస్ మిసైల్స్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. "పాకిస్తాన్లోని ప్రతి అంగుళం మా బ్రహ్మోస్ మిసైల్స్ రేంజ్ లోనే ఉంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా బ్రహ్మోస్ రేంజ్ ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఆపరేషన్ సిందూర్ అనేది ట్రైలర్ మాత్రమే. దానిద్వారా మన శత్రువుకు సత్తా ఏమిటో చూపించాం. పాకిస్తాన్ దేశానికి జన్మనివ్వగలిగిన ఇండియా.. అవసరమైతే ఏమైనా చేస్తున్నారని నిరూపించింది. అందువల్లే పాకిస్తాన్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉంటే మంచిది. అనవసరంగా మా దేశాన్ని గెలికితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని" కేంద్ర రక్షణ శాఖ మంత్రి హెచ్చరించారు.కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేసిన హెచ్చరికల నేపథ్యంలో పాకిస్తాన్ దేశానికి మరో షాక్ తప్పదా అనే వార్తలు వినిపిస్తున్నాయి.

## విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,**

గోదావరిఖని అక్టోబరు 21, :శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు త్యాగం, సేవకు నిజమైన ప్రతీకలు పోలీసులు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కుంటూ ముందుకు వెళ్లే యోధులు. విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రామగుండం పోలీస్ కమిషనర్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 191 మంది పోలీస్ అమరవీరుల పేర్లను అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రామగుండం పోలీస్ కమిషనర్ తో పాటు మంచిర్యాల జిల్లాల కలెక్టర్ కుమార్ దీపక్ పెద్దపల్లి డిసిపి కరుణాకర్, ఆర్ జి వన్ జి ఎం లలిత్ కుమార్, ఎన్టీపీసీ , ఆర్.ఎఫ్ సి.ఎల్ అధికారులు ఏ.సి.పిలు, ఇన్స్ స్పెక్టర్లు, ఆర్.ఐలు ఎస్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు వుంచి నివాళులు అర్పించిన పిదప, ఆర్.ఐ మల్లేశం సారధ్యంలో సాయుధ పోలీసులు శోక్ శ్రస్త్ చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సేవకోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు మహనుభావులని, పోలీసు అమరవీరుల చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ, ప్రజల శ్రేయస్సు కొరకు పాటుపడాలని, ప్రజల్లో మంచి పేరు రావాలంటే చిత్తశుద్ధి, నితీ, నీజాయితీతో పనిచేయాల్సి వుంటుందని పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే వుంటారని, వారు మన మధ్య లేనకున్నా మనం వారిని స్మరిస్తునే వుంటామని, అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవల్సిన భాధ్యత మనందరిపై వుందని, వారికి ఎలాంటి సమస్య వున్న వారికి పోలీస్ విభాగం తరుపున పూర్తి సహకారం అందజేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో అమరవీరుల కుటుంబ సభ్యులకు అందించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ పోలీస్ అండగా ఉంటుందని ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చినట్లైతే సంబందించిన ప్రభుత్వ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్, మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఎవో శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇన్స్పెక్టర్లు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు ఆర్ఐలు ఆర్ఎస్ఐలు సిపిఓ సిబ్బంది స్పెషల్ పార్టీ ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం అసంభవం.. బాంబు పేల్చిన ఖర్గే



హైదరాబాద్, అక్టోబరు 21,తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం అసంభవం.. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే సర్వనాశనం చేసిండు.. ఇదేదో ప్రతిపక్షాలు చెప్పిన మాటలు కాదు.. స్వయంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పిన మాటలు! తనను కలిసిన అసంతృప్త ఎమ్మెల్యేలతో ఖర్గే తన బాధను పంచుకున్నారట. ఈ మేరకు సీనియర్ జర్నలిస్ట్, సౌత్ ఫస్ట్ ఎడిటర్ వాసు సంచలన విషయాలను బయటపెట్టారు.సౌత్ ఫస్ట్ ఎడిటర్ తెలిపిన వివరాల ప్రకారం.. రేవంత్ రెడ్డి గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలం అయ్యాడని ఖర్గే విమర్శించారట. పరిపాలన గాడి తప్పిందని ప్రజలు అనుకుంటున్నారని.. మంత్రుల మధ్య కీచులాటలు, వాటాల పంపకాల లొల్లి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చిందని ఆవేదన చెందారట. బీసీ రిజర్వేషన్ అంశాన్ని రేవంత్ సరిగ్గా హ్యాండిల్ చేయకపోవడం వల్ల మన పరిస్థితి రెండిటికి చెడ్డ రేవడి అయ్యిందని కాంగ్రెస్ ఎమ్మెల్యేల దగ్గర ఖర్గే వాపోయారట.మొదటి నుంచి పార్టీలో అందరినీ కలుపుకొని పోలేదని.. ఇతర పార్టీలతో కూడా సరిగ్గా సమన్వయం చేసుకోలేదని ఖర్గే అన్నారని సమాచారం. ఇప్పుడు బీసీ రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందనే సంకేతాలు వెళ్తున్నాయని.. అది పార్టీకి తీవ్ర నష్టం చేసిందని తెలిపారట. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి దన్నుగా ఉన్న రెడ్లు, దళితులు ఈ అంశం వల్ల మనకు దూరం అయ్యారని పేర్కొన్నారట.. పోనీ బీసీలు అయినా మనకు దగ్గర అయ్యారా అంటే అదీ లేదు.. రేవంత్ చేసిన నిర్వాకం వల్ల అన్ని కులాల వాళ్లు కాంగ్రెస్ మీద ఆగ్రహంగానే ఉన్నారని మండిపడ్డారట. అనవసరంగా రేవంత్ ఇందులోకి రాహుల్ గాంధీ పేరును లాగాడని. ఇది రాహుల్ ఇమేజ్‌ను కూడా డ్యామేజ్ చేసిందని బాధపడ్డారట.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకాయిచి

అతివాద నేతగా పేరున్న సనే తకాయిచి జపాన్ తొలి మహిళా ప్రధాని గా ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం సనే తకాయిచిని ప్రధానిగా ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల కారణంగా ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. దాంతో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనే తకాయిచి ఎన్నికయ్యారు.ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువసభలో అధికార పార్టీ మెజారిటీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువసభలో కూడా మెజారిటీని కోల్పోయింది. దాంతో ఇషిబాపై ఒత్తిడి పెరిగి ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరుగగా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితోపాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకాయించి విజయం సాధించారు.ఇవాళ పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ, జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమి నుంచి తకాయిచికి భారీ మద్దతు లభించింది. దాంతో జపాన్ తొలి మహిళా ప్రధానిగా తకాయిచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకాయిచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రిత్వ పదవితోపాటు పలు కీలక పదవుల్లో పనిచేశారు.




## ఫ్రెండ్ షిప్ తో మోసం చేశారు..

**నమ్మి పెట్టుబడి పెడితే నట్టేట ముంచారు...వాటా తేల్చకుండా అమ్ముకునే ప్రయత్నాలు ...**

**న్యాయం చేయాలంటూ పెట్రోల్ బాటిల్ తో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన...**

సూర్యాపేట ;స్నేహాన్ని నమ్మి వ్యాపారం చేద్దామంటూ పెట్టుబడి పెడితే లెక్క తేల్చకుండా అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని హోటల్ క్యూ ముందు మంగళవారం ఆందోళనకు దిగారు. భాదితులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన ఇద్దరు డాక్టర్లు ఓ ప్రైవేట్ వ్యక్తి , శ్యామల సందీప్ అనే నేను నలుగురం కలిసి హోటల్ పెట్టాలని నిర్ణయించుకొని అందుకు ఓ డాక్టర్ కి సంబంధించిన భూమిలో రూ.2.20కోట్ల భారీ పెట్టుబడితో హోటల్ నిర్మాణాన్ని చేపట్టినట్లు శ్యామల సందీప్ తెలిపారు. హోటల్ ప్రారంభం ముందే అన్ని అగ్రిమెంట్ చేసుకొని 2029 వరకు నలుగిరికి సమాన హక్కులు ఉండేలా లీజు అగ్రిమెంట్ చేసుకున్నామని కానీ హోటల్ అనుకున్న స్థాయిలో నడవకపోవడంతో నష్టం వచ్చిందన్నారు.. దీనితో పార్ట్నర్స్ మధ్యలో భేదాభిప్రాయాలు వచ్చాయని అందులో వర్కింగ్ పార్ట్నర్ గా ఉన్న తనతో చెప్పకుండా గుట్టుచప్పుడు కాకుండా హోటల్ ను అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని నా వాటా తేల్చకుండా ముగ్గురూ కలిసి అన్యాయం చేస్తున్నారని వాపోయారు.. ఇప్పటికే ఫర్నిచర్ మొత్తం డాక్టర్ కి సంబంధించిన ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారాని, కొంత ఫర్నిచర్ సైతం అమ్ముకున్నారని ఆరోపించారు.. ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయం తెలిసి తాను కోర్ట్ ద్వారా నోటీసులు అందించనని తెలిపారు.. కోర్ట్ సెలవులు ఉన్న సమయంలో హోటల్ ని పూర్తిగా డిసమంటేల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..ఇప్పటికైనా వాటాలు తేల్చలని లేకుంటే మా కుటుంబం అంతా ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు..

## రహదారుల మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుల నిరసన



జూలూరుపాడు, అక్టోబర్ 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ధ్వంసమైన రహదారుల మరమ్మతులను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు మంగళవారం వినూత్న రీతిలో డిజిటల్ క్యాంపెయిన్ చేపట్టారు. జూలూరుపాడు మండలం పడమట నరసాపురం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడ్డ భారీ గుంతల సమీపంలో రోడ్డుపై బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లాకావత్ గిరిబాబు కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కొత్తగూడెం? ఖమ్మం మార్గంలోని జూలూరుపాడు మండలంలోని కొమ్ముగూడెం గ్రామం నుండి వైరా వరకు ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడం దారుణం అన్నారు. రహదారులు ధ్వంసమైన తీరు కన్పించేలా సెల్ఫీలు దిగి ప్రసార మాధ్యమాలకు ఫొటోలను విడుదల చేసి నిరసన వ్యక్తం చేశారు. రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక నాయకులు, గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

## రవాణా శాఖ అవినీతిపై విచారణ జరిపించాలి : జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కామేశ్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 21 : రవాణా శాఖలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతస్థాయి కమిటీ వేసి విచారణ జరిపించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రవాణా శాఖలో బస్సులు, లారీలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, లైసెన్స్ లు, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ఇలా ప్రతి పనికి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని, దీని కోసం ప్రత్యేక ప్రైవేట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మరీ ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ అయిన తర్వాత డీలర్లు, ఏజెంట్లు వసూలు చేసి అధికారులకు డబ్బులు ముట్టచెబుతారని, చెక్ పోస్ట్ ల వద్ద ఇసుక లారీలు, ట్రాక్టర్లు కాసుల వర్షం కురిపిస్తున్నాయని, ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు రేట్ ఫిక్స్ చేసుకుని దందా కొనసాగిస్తున్నారని తెలిపారు.నియోజకవర్గంలో నాయకులు చెప్పినట్టు ఇసుక లారీలకు, ట్రాక్టర్ లకు, స్కూల్ బస్సులకు రాయితీలు ఇస్తున్నారనేది బహిరంగ రహస్యమన్నారు. ప్రతి ఏటా స్కూల్ బస్సుల ఫిట్ నెస్ సర్టిఫికెట్ జారీ విషయంలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ అయిన తర్వాత డీలర్లు, ఏజెంట్లు డబ్బులు వసూలు చేసి అధికారులకు ముట్టచెబుతారని, ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు తూతూ మంత్రంగా చెక్ పోస్ట్ లపై దాడులు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా వీరి వెనుక ఉన్న సూత్రధారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణా శాఖలోని అవినీతి తిమింగలాలు బయటకు రావాలంటే కిందిస్థాయి సిబ్బంది నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు వారి ఆస్తులపై, వారి బినామీల ఆస్తులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బన్నీ, వినయ్, మురళి, కిషన్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

పటాన్ చెరు, అక్టోబర్ 21 : జూబ్లీహిల్స్‌లో జరుగనున్న ఉప ఎన్నిల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత తరపున ప్రచారంలో నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి , పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని 101వ డివిజన్ ఎర్రగడ్డ, 385 బూత్ పరిధిలో బూత్ ఇంచార్జిలు సత్యనారాయణ, సందీప్ గిరి గోస్వామి, ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఓఐజ యువసేన సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రారంభించి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ హయాంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. చేతకాని కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఇక నుంచి ఫార్మాట్ ఏదైనా ప్రతీ ఎన్నికల్లో విజయం సాధించేది బీఆర్ఎస్ పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ 385 బూత్ ఇంచార్జీ లు సత్యనారాయణ, సందీప్ గిరిగో స్వామి , ఐలాపూర్ మాణిక్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ బండ్లగూడ టౌన్ ప్రెసిడెంట్ భరత్ కుమార్,అజ్జు అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.



# పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం

విజయవాడ, అక్టోబరు 21, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం ఉందంటున్నారు. పవన్ కళ్యాణ్ పదే పదే పదిహేనేళ్ల పాటు కూటమి కలసి ఉంటుందని చెబుతూ వస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి పవన్ కళ్యాణ్ పెట్టే షరతులు కూడా మారతాయంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే పవన్ కళ్యాణ్ గౌరవంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను ఇబ్బందిపెట్టే విధంగా మాట్లాడినా మిత్రధర్మం కోసం పవన్ కళ్యాణ్ సహిస్తూ కూటమి విచ్ఛిన్నం కాకపోవడానికి తానే కారణమని గట్టిగా చెప్పదలచుకున్నారు. ఇప్పటి వరకూ మిత్రపక్షాల్లో ఉన్న టీడీపీ నేతలు మాత్రమే జనసేన పై కొంత నోరు జారారుఅదేసమయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రం చాలా వరకూ సంయమనం పాటిస్తూ వస్తున్నారు. అందుకు దూరాలోచన కారణమన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మొన్నటి ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించిన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టగలిగారు. కీలకమైన పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖ వంటివాటిని ఏరికోరి తీసుకున్నారు. అంతేకాదు కొన్ని విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాలను కూడా మంత్రి మండలి సమావేశాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో అమరావతి రాజధాని రైతుల నుంచి అదనపు భూముల విషయంలో అభ్యంతరాలు తెలపడంతో పాటు ఇటీవల లూలూ సంస్థ పెట్టిన షరతులను కూడా ప్రశ్నించి తాను అవసరమైనప్పుడు ప్రశ్నిస్తానని సిగ్నల్ అధికార టీడీపీకి ఇవ్వగలిగారు.మరోవైపు 2024 ఎన్నికల వరకూ ఆయన ఎమ్మెల్యేగా కూడా ఎన్నిక కాలేదు. దీంతో అనుభవం లేకపోవడంతో సీట్ల పంపకంలో గాని, చివరకు మంత్రి పదవుల విషయంలోగాని ఒకింత రాజీ పడ్డారు. తాను తక్కువ సంఖ్యలో సీట్లు తీసుకున్నానని ఆయనకు తెలుసు. జనసైనికులకే కాదు తన అభిమానులకు కూడా అది నచ్చదని తెలిసినా చంద్రబాబు అనుభవానికి పెద్దపీట వేయాలని సహకరించారు. ఇకపై అలా ఉండదంటున్నారు. ఎందుకంటే ఉప ముఖ్యమంత్రిగా ఎటూ వచ్చే ఎన్నికల నాటికి ఐదేళ్ల అనుభవం ఉంటుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో షరతులు ఉంటాయన్నది జనసైనికుల నుంచి వినిపిస్తున్నమాట. అలాగే సీట్ల విషయంలోనూ రాజీ ఉండదన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతుంది. తనకు కూటమి కలసి ఉండటం ఎంత అవసరమో టీడీపీకి అంతకంటే ఎక్కువ అవసరం కావడంతో ఈరోజు షరతులు వర్తిస్తాయని జనసైనికులు బాహాటంగానే చెబుతున్నారు.

# యాక్టివ్ అయిన కేడర్

విజయవాడ, అక్టోబరు 21, వైసీపీ అధినేత జగన్ పార్టీకి కేవలం పదహారు నెలల్లోనూ ఆంధ్రప్రదేశ్ లో కొంత ఊపు కనిపిస్తుందని ఆ పార్టీ నేతలు అంచనా వేసుకుంటున్నారు. అందుకే ఇన్నాళ్లూ బయటకు రాని వారు కూడా ఇప్పుడు వైసీపీకి వచ్చే క్రేజ్ ను చూసి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటి వరకూ వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారం వస్తుందో రాదో అన్న అనుమానంతో ఇంటి గడప దాటని నేతలు కూడా నేడు బయటకు వచ్చి అధికార పార్టీ పై విమర్శలు చేస్తున్నారు. జనం నాడి కొంత తెలియడంతో వారి మనసులు కూడా మారాయంటున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన పదిహేను నెలల నుంచి కనిపించని నేతలు నేడు బయటకు రావడంతో పాటు వైసీపీ ఇచ్చిన కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు.అదే సమయంలో మీడియా సమావేశాలు కూడా పెట్టి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ గుడివాడ అమర్ నాథ్, పేర్ని నాని, జోగి రమేష్, ఆర్కే రోజా, విడదల రజనీ, బొత్స సత్యనారాయణ వంటి నేతలు మాత్రమే మీడియాలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి ముందుండే వారు. కానీ దూరంగా ఉండే ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు కూడా బయటకు వస్తున్నారంటే పార్టీకి కొంత హైప్ కనపడుతుందన్న భావన నేతల్లో వ్యక్తమవుతుంది. కేవలం పదహారు నెలల్లోనే వైసీపీ నేతలు ఇంత యాక్టివ్ అయితే రానున్న కాలంలో మరింతగా బయటకు వచ్చి ప్రజల్లోకి వెళతారన్న అంచనాలో కేంద్ర పార్టీ కార్యాలయం కూడా ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా జగన్ పర్యటనలకు జనం నుంచి మంచి స్పందన రావడంతో పాటు క్యాడర్ కూడా భయం లేకుండా వచ్చి పాల్గొనడంతో ఈ మార్పునకు కారణమని అంటున్నారు. అనేక అంశాలు వైసీపీకి ప్లస్ గా మారాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధానంగా గుంటూరు మిర్చి రైతులు, పొదిలి పొగాకు రైతులు, బంగారుపాళ్యంలో చిత్తూరు మామిడి రైతుల కోసం వెళ్లిన పర్యటనతో పాటు పల్నాడు పర్యటన, తాజాగా ఉత్తరాంధ్ర పర్యటన కూడా సక్సెస్ కావడంతో ఒక్కొక్కరుగా నేతలు బయటకు వస్తున్నారు. దీంతో పాటు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశంతో పాటు కల్తీ మద్యం ఘటన కూడా తమకు అనుకూలంగా మారుతుందని అంచనా వేసుకుని మరీ నేతలు బయటకు వస్తున్నారని వైసీపీ కీలక నేత ఒకరు చెప్పారు. మొత్తం మీద రానున్న రోజుల్లో వైసీపీ నేతలు ఇక జనం బాట పట్టే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఎమ్మెల్యేను బెదిరించి కోటి రూపాయలు

గుంటూరు, అక్టోబరు 21, దేశవ్యాప్తంగా రోజురోజుకూ డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోతున్నాయి. సామాన్యులనే కాదు.. ప్రజాప్రతినిధులను కూడా కేటుగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా.. ఏపీలోని ఓ ఎమ్మెల్యేను బెదిరించి అతని నుంచి కేటుగాళ్లు కోటి రూపాయలు కొట్టేశారు. అసలు విషయం తెలుసుకున్న సదరు ఎమ్మెల్యే.. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకిదిగి విచారణ చేస్తున్నారు.ఏపీకి చెందిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని నివాసంలో ఉండగా.. ఈ నెల 10వ తేదీన ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారి గౌరవ్ శుక్లాగా పరిచయం చేసుకున్నాడు. ఎమ్మెల్యే బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించాడు. ఆ తరువాత కొద్దిసేపటికి మరో నెంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. యూనిఫాంలో ఉన్న ఆ వ్యక్తి ముంబై సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారి విక్రమ్‌గా పరిచయం చేసుకున్నాడు.ఉగ్రవాదుల బ్యాంకు లావాదేవీల కేసులో మీకు ప్రమేయం ఉంది.. మనీ లాండరింగ్ జరిగిందని పేర్కొంటూ.. ఒక ఉగ్రవాది ఖాతా నుంచి రూ.3కోట్లు మీ బ్యాంక్ ఖాతాకు బదిలీ అయ్యాయంటూ నకిలీ పత్రాలు, అరెస్టు వారెంట్లు చూపించి బెదిరించాడు. అంతేకాదు.. మీ బ్యాంక్ అకౌంట్లు పరిశీలించాలి.. అందుకు సహకరించాలి.. ఏ క్షణమైనా అరెస్టు చేస్తామంటూ భయపెట్టాడు. ఈ క్రమంలో పలు దఫాలుగా ఎమ్మెల్యే నుంచి రూ.1.07కోట్లు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు.మళ్లీ కొద్దిగంటల తరువాత మరో రూ.60లక్షలు ఇవ్వాలి అంటూ డిమాండ్ చేశాడు. దీంతో మోసపోయినట్లుగా గుర్తించిన ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్.. వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లో జరిగిన విషయాన్ని వివరించి ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు విచారణ చేస్తున్నారు.

# పీడీఎస్ బియ్యం కనిపెట్టేలా మొబైల్ టెస్టింగ్ కిట్స్

కాకినాడ, అక్టోబరు 21, పీడీఎస్ బియ్యం మాఫియా అనగానే కాకినాడ పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అంతటిస్థాయి వివాదం కాకినాడ చుట్టూ ముసురుకుంది.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ పద్ధతిలో సేకరించిన పేదల బియ్యాన్ని చివరకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి అక్రమ సొమ్మును ఆర్జిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికలకు ముందు నుంచి పెద్ద దుమారమే రేగింది.. ఈనేపథ్యంలోనే ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీడీఎస్ బియ్యం మాఫియా అంతుచూస్తామని కూడా వాగ్ధానాలు చేశారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటకు వచ్చి నేరుగా పోర్టుకు వెళ్లారు.. అక్కడ అక్రమంగా ఎగుమతి అవుతున్న పీడీఎస్ బియ్యం ను టన్నుల కొద్దీ గుర్తించి సీజ్ చేయించారు.. ఆతరువాత ఏపీ సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ కూడా మరో రెండు సార్లు కాకినాడ పోర్టులో విస్తృతంగా తనిఖీలుచేసి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం సీజ్ చేయించారు.. కానీ చాలా వరకు అవి పీడీఎస్ బియ్యం అని నిరూపించలేని పరస్థితి తెలెత్తింది.. ఇదిలా ఉంటే కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను అడ్డుకునేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించినప్పటికీ అవికూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి.. కానీ యధారాజా తథా ప్రజా అన్న చందంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అనే నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది..గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా జరిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నియంత్రణ కాలేని పరిస్తితి కనిపిస్తోంది.. రేషన్ మాఫియాలో చాలా మంది పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి..ముఖ్యంగా తీర ప్రాంతాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, దీనికి అడ్డుకట్ట వేయాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్తితి కనిపించింది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మంచి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లయ్యింది.. రేషన్ బియ్యం పట్టుకున్నా, అవి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం అని అనుమానాలున్నా పీడీఎస్ బియ్యం అని రూఢీ చేయడానికి టెస్ట్ చేయడానికి ల్యాబ్ కి పంపి వారం రోజులు వెయిట్ చేయాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం ఒక మొబైల్ కిట్‌ను రూపకల్పన చేయించి పంపిణీకు సిద్ధం చేసింది. మొబైల్ కిట్ లో ఉండే కెమికల్ బాటిల్స్ రేషన్ బియ్యం లో వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న పోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి. వెంటనే అది అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం అని అర్ధం క్లియర్‌కట్‌గా అర్ధం అవుతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 700 కిట్లు, 33 మంది అదనపు సిబ్బందిని విశాఖపట్నం లో 3 చెక్ పోస్ట్ ల దగ్గర నియమించారు. అలాగే కాకినాడ లో కూడా సుమారు 700 కిట్లు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను చాలా సులభంగా గుర్తించి కట్టడి చేయడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. పీడీఎస్ బియ్యంలో పోషక విలువలు పెంచేవిధంగా ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలను తగ్గించేందుకు ఈ ప్రక్రియను ప్రారంభించింది. వీటివల్ల ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లాంటిముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి.. ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతీ క్వింటాల్ సాధారణ బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్ కలుపుతున్నారు. 100 కిలోల బియ్యంలో అంటే ఒక శాతం వంతు ఫోర్టిఫైడ్ బియ్యం ఉంటుంది.. ఇప్పుడు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో పట్టించేందుకు ఈ ఫోర్టిఫైడ్ రైస్ ఉపయోగ పడుతున్నాయి..

# యానాం బీచ్ లో సంక్రాంతి సంబురాలు

కాకినాడ, అక్టోబరు 21, సువిశాల సాగరతీరం.. తెలుపు వర్ణంలో ఆకట్టుకునే తీరంలోని ఇసుక తిన్నెలు.. కాసేపు తీరంలో గడిపితే మనసుకు, తనవుకు తాకుతూ అవధులు లేని ఉత్సాహాన్ని ఇచ్చే పిల్లతిమ్మెరలు.. అల్లంత దూరంలోనే పచ్చని తీవాచీ నిలబెట్టిన చందంగా కనిపించే సరుగుడు తోటలు.. బీచ్ కు వెళ్లే ముందే రా రమ్మని ఆహ్వానం పలికే ఉప్పుటేరుల్లో బోట్ షికార్లు.. ఇక నోరూరించే ఘుమఘుమల పసందైన గోదావరి వంటకాలు.. ఇక సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింభించేలా ప్రత్యేక కార్యక్రమాలు.. జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు.. రాత్రి అయితే చాలు వినోద కార్యక్రమాలు.. ఇలా ఒక్కటేమిటి.. అన్ని హంగులతోనూ ఈ సారి సంక్రాంతి పండుగను అదిరిపోయే స్థాయిలో ప్లాన్‌చేస్తున్నారు. ఎక్కడ అనుకుంటున్నారా.. అదేనండీ ఆంధ్రా గోవా.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఉప్పలగుప్తం మండలం సూరసాన యానాం బీచ్‌లో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సంక్రాంతి పండుగ సంబరం బీచ్ ఫెస్టివల్‌గా ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు ఇంకా మూడు నెలల సమయం ఉంది. అయినా ముందస్తుగానే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సారథ్యంలో పక్కాగా మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు విడుదల చేయడంతోపాటు చమురు, సహజ వాయు సంస్థల సీఎస్సార్ నిధుల ద్వారా పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా యానాం బీచ్ లో అధికారులు పర్యటించి ప్రణాళిక సిద్ధం చేశారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు ఇక్కడికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో తరలివచ్చే అవకాశాలు ఉండడం వల్ల రోడ్లు అభివృద్ధి, పర్యాటకులు ఉండేందుకు రిసార్ట్‌లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, భద్రత, రవాణా సదుపాయం ఇలా అనేక అంశాలపై పరిశీలించి ముందస్తు ఏర్పాట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యానాం బీచ్ వరకు నేరుగా భారీ వాహనాలు సైతం వెళ్లేలా పక్కా సీసీ రోడ్లు నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే క్రౌడ్ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టకుని ఇన్ రోడ్.. ఔట్ రోడ్డు లెక్కన రెండు విశాలమైన సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు కలుగకుండా ఈ ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటలకులకు హాస్పిటాలిటీ సదుపాయం, ఇతర సదుపాయాలతోపాటు మూడు నెలల వ్యవధిలో నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు..గతేడాది జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ ఏడాది కూడా అంతకంటే భారీ స్థాయిలో సంక్రాంతి పండుగకు ముందే నిర్వహించాలని ఆలోచనలో ఉన్నామంటున్నారు. దీనికి తోడు పగటి పూట బోట్ షికార్, బీచ్ సాండ్ వెహికల్స్, స్కై డ్రైవింగ్, బెలూన్ డైవింగ్ ఇలా పలు అడ్వెంచర్ ఈవెంట్స్ నిర్వహించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి 3 రోజులు కూడా యానాం బీచ్‌లోనే భారీ ఎత్తులో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. దీనికోసం ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు దిశగా కృషిచేస్తున్నామన్నారు. భారీ భోగి మంటల నుంచి రంగవల్లుల అలంకరణ తదితర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింభించేలా పండుగ నిర్వహిస్తామని, ఈ ఏడాది బీచ్ ఫెస్టివల్ తరలి వచ్చేందుకు వసతి, సదుపాయాల కల్పనకు ముందస్తుగానే ఆంధ్రాగోవా బీచ్ ఫెస్టివల్ అనే వెబ్ సైట్ ద్వారా స్లాట్లు తెరుస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవాలంటే 34 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అమలాపురం నుంచి బీచ్ వరకు పక్కా రోడ్లు సదుపాయాలున్నాయి. బస్సు సదుపాయం కూడా ఉంది. ఇక రాజమండ్రి నుంచి వచ్చేవారు రాజమండ్రి రైల్వే స్టేషన్ నుంచి అమలాపురం వచ్చి అమలాపురం నుంచి ఎస్.యానాం చేరుకోవచ్చు. కాకినాడ నుంచి అమలాపురం వచ్చి అక్కడి నుంచి ఎస్.యానాం బీచ్‌కు సునాయాసంగా చేరుకోవచ్చు.

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

విశాఖపట్టణం, అక్టోబరు 21, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్‌ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం విశాఖలో స్థల పరిశీలన జరుగుతోంది. గూగుల్ సంస్థ ప్రతినిధులు విశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు.గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు. త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి 2028-32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. దీనితో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు రావటం కష్టమంటున్నారు. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

# ఏలూరు లో పోలీసు అమరవీరుల స్మృతి దినం-2025

ఏలూరు,ఏలూరు పోలీసు ప్రధాన కార్యలయం దగ్గర లోని పోలీసు పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం జరిగిన పోలీసు అమరవీరుల స్మృతి దినం-2025 కార్యక్రమానికి ఏలూరు రేంజ్ ఏలూరు ఐజి జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి హజరయ్యారు. అతిధులకు పోలీసు సిబ్బంది గౌరవ వందనము సమర్పించారు. పోలీసు సిబ్బంది కవాతు కు కామెండర్ గా ఏ ఆర్ ఆర్ ఐ, సతీష్ నిర్వహించి అమర వీరులు కు స్మృతి పేరేడు ను నిర్వహించినారు.ముఖ్య అతిథి, అతిథి, పోలీసు అధికారులు అమర వీరులు స్తూపం వద్ద స్వేచ్ఛా స్వర్గాన్ని సమాజానికి అందించేది పోలీసులే. అంతటి నిస్వార్థమైన, అంకితభావంతో కూడిన సేవలందిస్తూ ప్రాణాలర్పించిన త్యాగధనులందరికీ నివాళులర్పించారు.పోలీసులు తమ విధుల లో భాగంగా ప్రజా సేవలో ధైర్య సహసాలతో అసాంఘిక శక్తులతో పోరాడుతూ అసువులు బాసిన పోలీస్ వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లు మృతి

విశాఖ దీపావళి పండుగ రోజు గాజువాక లో విషాదం నెలకొంది. న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు 12 మంది బ్యాచ్ గా బీచ్ కి వెళ్లారు. ట్రిపుల్ రైడింగ్ తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ డివైడర్ ఢీ కొట్టడంతో అజయ్, మనోజ్ మైనర్లు మృతి చెందారు. మరో మైనర్ మధు కి చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరంతా కూర్మానపాలెం నుండి ఆర్కే బీచ్ కు వెళ్తుండగా పాత గాజువాక వద్ద డివైడర్ ను ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది.

# స్టేట్స్ లో ట్వీట్స్ వార్...

విశాఖపట్టణం, అక్టోబరు 21, స్టేట్స్ అండ్ ట్వీట్స్ వార్ నడుస్తూనే ఉంది. ఏపీ, కర్ణాటక మినిస్టర్స్ మధ్య ఇన్వెస్ట్‌మెంట్స్‌పే డైలాగ్ వార్ కొనసాగుతోంది. బెంగళూరులో రోడ్లు బాలేవు..సౌకర్యాలు కల్పించడం లేదని కంపెనీల సీఈవోలు పెట్టిన పోస్టులతో వివాదం మొదలై..లోకేశ్ రెస్పాండ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ చేసిన ట్వీట్‌కు లోకేశ్ అదే స్థాయిలో రియాక్ట్ కావడం ఆసక్తికరంగా మారింది. కర్ణాటక మంత్రులు?ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. బెంగళూరులో పరిశ్రమలను రన్ చేయలేకపోతున్నామని..అక్కడి నుంచి వెళ్లిపోతామంటూ పలువురు ఇండస్ట్రియలిస్టులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఆ మధ్య చర్చకు దారితీసింది. ఇదే అదునుగా..ఏపీకి వచ్చేయండి..మీకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ అంటూ లోకేశ్ చేసిన ట్వీట్స్ ఆసక్తికరంగా మారాయి. బెంగళూరులో రోడ్లు, ఇతర సౌకర్యాలు, వసతులపై ఏరో స్పేస్ పార్క్, బ్లాక్ బక్ అనే పరిశ్రమ అసంతృప్తిపై గతంలోనే లోకేశ్ రియాక్ట్ అయ్యారు.ఏరో స్పేస్ పార్క్‌ను అనంతపురంకు..బ్లాక్ బక్ పరిశ్రమలను విశాఖపట్నానికి తరలించాలని కోరారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో కాక రేగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయని అక్కడి విపక్షాలు సిద్ధరామయ్య సర్కార్‌పై అటాక్ స్టార్ట్ చేయడంతో..15 రోజుల క్రితం పెద్ద రచ్చే అయింది. అప్పటినుంచే ఏపీ, కర్ణాటక మంత్రుల మధ్య ట్వీట్ వార్ మొదలై..ఈ మధ్య కాస్త చల్లబడిందిఇప్పుడు గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ ప్రియాంక్ ఖర్గే చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా రాయితీలు ఇచ్చి గూగుల్ డేటా సెంటర్‌ను ఏపీకి తెచ్చుకుందన్నారాయన. అన్ని రాయితీలు ఇస్తే ఏ రాష్ట్రం అయినా పెట్టుబడులు తెచ్చుకోవచ్చన్నారు. అంతేకాదు ఏపీ అప్పులు ఇప్పుడు దాదాపు రూ.10 లక్షల కోట్లకు పెరిగాయని, కేవలం ఒక సంవత్సరంలోనే రూ.లక్షా 61 వేల కోట్లకుపైగా అప్పులు తీసుకున్నారని కూడా ప్రియాంక్ ఖర్గే ట్వీట్ చేశారు.ఆంధ్రా ఫుడ్ స్పైసీగా ఉంటుందని..ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో కాస్తంత ఘాటు ఉన్నా.. దాన్ని ఆస్వాదిస్తారు. కానీ పోషకాహార నిపుణులు ఆహారంలో సమతుల్యత ఉండాలని సిఫార్సు చేస్తున్నారు. అలాగే ఆర్థికవేత్తలు కూడా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్‌ను మెయింటేన్ చేయాలని చెబుతున్నారంటూ ప్రియాంక్ ఖర్గే తన ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్..ప్రియాంక్ ఖర్గేకు కౌంటర్ ఇచ్చారు. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడంపై పొరుగు రాష్ట్రాల్లో అలజడి మొదలైందన్నారు. ఆంధ్రా ఆహారం కారంగా ఉంటుందని అంటున్నారని, తమ పెట్టుబడులు కూడా అలాగే అనిపిస్తున్నాయని చురకలు అంటించారు


# పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం కలెక్టర్

## సమాజ రక్షణలో పోలీసుల సేవలు ఆదర్శం: ఎస్పీ



-- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21-విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అన్నారు. మంగళవారం బొమ్మలసత్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మన్నరాజు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ? "ప్రజల రక్షణ కోసం ప్రాణాలనూ పణంగా పెట్టే పోలీసుల సేవలు సమాజానికి ఆదర్శం. సైబర్ నేరాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజాభిమానాన్ని పొందాలి," అని సూచించారు.ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ ? "పోలీసు ఉద్యోగం ఎంతో కష్టతరం. ఎండ, వాన, చలి తేడా లేకుండా పోలీసులు ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్నారు. లడఖ్‌లో చైనా దాడిలో వీరమరణం పొందిన సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగం మనందరికీ ప్రేరణ," అన్నారు.మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మన్నరాజు మాట్లాడుతూ ? "పోలీసులు సైనికుల్లా సమాజంలో చట్టవ్యవస్థను కాపాడుతూ ప్రజల రక్షణలో అచంచలంగా నిలుస్తున్నారు," అన్నారు.

# స్వాతి నక్షత్రం నృసింహ స్వామి వారి అభిషేకం



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21-తెలుగు పేట నంద్యాలశ్రీ ఘణ మద్దులేటి లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం పర్వదినాన శ్రీ నృసింహ స్వామి వారి అభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.అక్టోబర్ 22వ తేదీ బుధవారం ఉదయం ఆలయ అర్చకులు మూలమూర్తి శ్రీ మద్దులేటి లక్ష్మి నృసింహ స్వామి వారికి పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.స్వామి వారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి మహా మంగళహారతి దర్శించి, నైవేద్యం స్వీకరించి దివ్యానుగ్రహం పొందాలని కోరారు.ప్రతి నెల స్వాతి నక్షత్రానికీ ఈ కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించడం జరుగుతుందని కమిటీ పేర్కొంది.

# మంగళవారం అమావాస్య సందర్భంగా శ్రీ గాయత్రీ మాతకు ప్రత్యేక అలంకరణ..



విభారే న్యూస్ అక్టోబర్ 21 ఎమ్మిగనూరు..స్థానిక గీతానగర్లో వెలసిన శ్రీ గాయత్రి మాత ఆలయంలో మంగళవారం రోజు అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి వేకువ జామునే అభిషేకం అర్చన పూల అలంకరణ చేసి ప్రసాదాన్ని నివేదించి మహా మంగళహారతి ఇచ్చారు. అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అమ్మవారికి పూజా కార్యక్రమాలన్నీ ఆలయ పురోహితులు బలకుంది నరహరి శాస్త్రి చే నిర్వహించబడును.

# మంగళవారం అమావాస్య సందర్భంగా శ్రీ గాయత్రీ మాతకు ప్రత్యేక అలంకరణ..

విభారే న్యూస్ అక్టోబర్ 21 ఎమ్మిగనూరు..స్థానిక గీతానగర్లో వెలసిన శ్రీ గాయత్రి మాత ఆలయంలో మంగళవారం రోజు అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి వేకువ జామునే అభిషేకం అర్చన పూల అలంకరణ చేసి ప్రసాదాన్ని నివేదించి మహా మంగళహారతి ఇచ్చారు. అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అమ్మవారికి పూజా కార్యక్రమాలన్నీ ఆలయ పురోహితులు బలకుంది నరహరి శాస్త్రి చే నిర్వహించబడును.



# మెప్మాలో అక్రమాల భరతం

## అవినీతి ఉద్యోగులపై ఉక్కుపాదం సంస్థను ప్రక్షాళన దిశగా పీడీ వెంకట దాస్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి, అక్టోబర్ 21- ?నంద్యాల జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పేరుకుపోయిన అవినీతి, అక్రమాలకు కొత్త ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) వెంకట దాస్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మెప్మా కార్యాలయాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నామని, అవినీతికి తావు లేకుండా చేస్తామని స్పష్టం చేశారు.?నంద్యాల మెప్మా కార్యాలయంలో పరిస్థితి ఎంత దిగజారిందో చెప్పడానికి ఇటీవల జరిగిన ఘటనే నిదర్శనం. అవినీతి ఆరోపణలకు సంబంధించి ఏకంగా కార్యాలయం లోపలే సీఓలు (కమ్యూనిటీ ఆర్గనైజర్లు), సీఆర్‌పీలు (కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్) కొట్టుకున్నారన్న వార్త జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేయాల్సిన ఉద్యోగులు ఇలా వ్యక్తిగత కక్షలు, అక్రమాల విషయంలో గొడవపడడంపై పీడీ వెంకట దాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.?ఈ ఘర్షణ, అవినీతి ఆరోపణలపై గత నెలలో విజయవాడ నుండి వచ్చిన ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపారని తెలిపారు . ఈ విచారణలో అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో, తక్షణమే ఇద్దరు సీఓలు ? లక్ష్మి కుమారి, దూదేకుల ఉశేన్ బీ ? లను, సస్పెండ్ చేశారు. అలాగే ఇద్దరు ఆర్‌పీలు ? భవానీ, రహిమత్‌లను. తొలగించడం జరిగిందని పీడీ తెలిపారు.?"అవినీతి ఉద్యోగుల మధ్య గొడవలు, సస్పెన్షన్లతో మెప్మా పరువు బజారున పడిందని పేద మహిళల కష్టార్జితాన్ని, వారికి అందాల్సిన ప్రభుత్వ సాయాన్ని మధ్యలో దోచుకుంటున్న ఈ వ్యవస్థను సమూలంగా మార్చాలి" అని మహిళా సంఘాల నాయకులు బలంగా డిమాండ్ చేశారన్నారు .?తాజాగా బాధ్యతలు చేపట్టిన పీడీ వెంకట దాస్‌కు ఇది తొలి, అతిపెద్ద సవాలుగా మారింది. సస్పెన్షన్లతో సరిపెట్టకుండా, కార్యాలయంలోని అవినీతికి మూల కారణాలను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ఉక్కుపాదం మోపాలని పలు మహిళా సంఘాలు ఆయన్ను కలిసి విజ్ఞప్తి చేశాయి. నంద్యాల జిల్లాకు పూర్తి స్థాయి పీడీగా బాధ్యతలు స్వీకరించిన వెంకట దాస్, పేద మహిళల సంక్షేమం కోసం ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటారో జిల్లా ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ఆరు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు

## శానిటేషన్‌లో లోపాలుంటే కఠిన చర్యలే మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరిక



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21-?నంద్యాల పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం ఉదయము పట్టణంలోని ఆరు కీలక వార్డుల్లో ఆయన ఆకస్మిక పర్యటన జరిపి, జరుగుతున్న శానిటేషన్ పనులను స్వయంగా పరిశీలించారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించే ఏ చిన్న లోపాన్ని కూడా సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన అధికారులను గట్టిగా హెచ్చరించారు.?కమిషనర్ శేషన్న తన పర్యటనను జ్ఞానపురం, రోజాకుంట ప్రాంతాల నుండి ప్రారంభించి, జగజ్జనని నగర్, ములాన్ పేట, బాలాజీ కాంప్లెక్స్, పొన్నాపురం వార్డుల వరకు విస్తరించారు. ముఖ్యంగా డ్రైనేజీల నిర్వహణ, చెత్తను సక్రమంగా తరలించడం, వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం వంటి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో క్లీనింగ్ ప్రక్రియలో ఉన్న లోపాలను గుర్తించి, అక్కడికక్కడే సిబ్బందికి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ప్రజలు నివసించే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దూరమవుతాయి. శానిటేషన్ విషయంలో అధికారులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదు. ఎక్కడైనా చెత్తాచెదారం పేరుకుపోయినా, డ్రైనేజీలు మూసుకుపోయినా, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్లే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం," అని హెచ్చరించారు.??ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించే ప్రక్రియను పటిష్టం చేయాలని, తడి, పొడి చెత్త విభజనను ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని శానిటరీ సెక్రటరీలను కమిషనర్ ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్ర నంద్యాలగా మార్చడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.?ఈ పర్యటనలో మున్సిపల్ కమిషర్‌తో పాటు శానిటరీ సూపర్వైజర్ మురళీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మరియు అన్ని సంబంధిత వార్డుల సచివాలయ శానిటేషన్ సెక్రటరీస్ పాల్గొన్నారు.

# నేటి నుండి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక మాసం ప్రారంభం



విభారే న్యూస్ అక్టోబర్ 21 ఎమ్మిగనూరు..స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీనగరేశ్వర స్వామి వార్ల దేవాలయం నందు అభిషేకములు, కార్తీకదీప ఆరాధనలు జరుగును. నేడు కార్తీక శుద్ధ పాడ్యమి 22.10.2025 మొదలు మార్గశిర శుద్ధ పంచమి 25.11.2025 వరకు విశేష పూజలు నిర్వహించేదరు. నేటి సాయంత్రం 6.30 ని.లకు దేవాలయం నందు శ్రీమతి చిన్ని నాగరత్నమ్మ చిన్ని ప్రకాశం శెట్టి అధ్యక్షులు (ఎమ్మిగనూరు రిటైల్ మర్చంట్ అసోసియేషన్) దంపతుల వారిచే అఖండ జ్యోతి ప్రజ్వలన ప్రారంభించబడును.17.11.2025 కార్తీక మాస నాలుగో సోమవారం సాయంకాలం 5.30 ని.లకు శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దశ (10) లక్షల దీపోత్సవం,51 లీటర్లతో శివునికి పాలాభిషేకం నిర్వహించబడును. పై కార్యక్రమంలో పాల్గొను వారు ,9 ఒత్తుల కట్టలు, నూనె వారి వెంట తెచ్చుకోవలెను. ప్రమిదలు మాత్రం ఆర్యవైశ్య సంఘం వారే సమకూర్చేదరు. కార్యక్రమం అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేయడమైనది. కార్తీక మాసంలో ప్రతి రోజూ ఉదయం 7.30 ని.లకు శ్రీ నగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం జరుగును. అభిషేకంలో పాల్గొను దంపతులు ఒక్కరోజు ముందుగా అర్చకులకు తెలుపవలెను. ఈ సదవకాశంను ఆర్యవైశ్య కుటుంబీకులందరూ సద్వినియోగపరచుకొని అమ్మవారి కృపకు పాత్రులగవలెనని ఆర్యవైశ్య సంఘం సభ్యులు కోరారు. పై పూజా కార్యక్రమాలన్నీ ఆలయ అర్చకులు రాతన గురు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడును. కార్తీక శుద్ధ చతుర్దశి 04.11.2025 మంగళవారం ఉదయం 10.02 ని.లకు దాత్రి యజ్ఞం మధ్యాహ్నం మన భోజన కార్యక్రమం శ్రీ వాసవి కళ్యాణ మండపం ఆవరణం నందు నిర్వహించబడును. వనభోజనం టిక్కెట్లు దేవకీ గార్మెంట్స్ సెల్ నెంబరు.9885956357. శ్రీ శ్రీనివాస టూరిస్ట్ సెల్ నెంబరు.9948779386. వినోద్ ప్రింటర్స్ సెల్ నెంబరు.9290495710. వారి వద్ద లభించును. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ప్రతాప్ శ్రీకాంత్ సెల్ నెంబరు.9866155108 కార్యదర్శి అనుముల రాజశేఖర్ గుప్తా సెల్ నెంబరు.9885476952. కోశాధికారి దేవకి వెంకటేశ్వర్లు 9885956357..

# కరువు భత్యం ఉత్తర్వులు సవరించాలి, అరియర్స్ చెల్లించాలి - ఏపీటీఎఫ్ డిమాండ్.




విభారే న్యూస్ అక్టోబర్ 21 ఎమ్మిగనూరు.ఉద్యోగులకు పెన్షనర్లకు దీపావళి కానుక అంటూ రెండు రోజుల నుంచి నానా హంగామా చేస్తూ ప్రకటించిన కరువు భత్యం తాలూకు ఉత్తర్వులను నేడు విడుదల చేస్తూ ఉద్యోగులకు రెండు వేల ఇరవై నాలుగు, జనవరి నుండి ఇరవై ఐదు, సెప్టెంబర్ వరకు రావాల్సిన అరియర్లను సర్వీస్ నుండి వైదొలిగే సమయంలో అంటే రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని, చనిపోయిన ఉద్యోగికి అయితే వారసులకు ఇస్తామని ఉత్తర్వులలో పేర్కొనడం సంక్షేమ రాజ్య ప్రజల్లో భాగమైన ఉద్యోగుల సంక్షేమాన్ని వీడడం అవుతుందని, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ గా దీనిని ఖండిస్తూ "తక్షణమే సదరు ఉత్తర్వులను సవరించి 19 నెలల అరియర్లను ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు జమ చేయాలని అలాగే సిపిఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రూపేనా చెల్లించాలని" రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని తెలియజేశారు.

# సూర్య దేవాలయంలో నేటి నుంచి 20.11.2025 వరకు గౌరీ శంకర స్వామి కి ప్రతిరోజు లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం..







విభారే న్యూస్ అక్టోబర్ 21 కర్నూలు జిల్లా ప్రతినిధి. 22.10.2025 బుధవారం నుండి 20.11.2025 గురువారం వరకు పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహా గౌరీ శంకర స్వామి వారికి ప్రతిరోజు లఘున్యాస పూర్వక రుద్రాభిషేకము జరుగును. అత్యంత పుణ్యప్రదమైన కార్తీక మాసంలో చేసే శివారాధన విశేష ఫలితములు ఇవ్వగలదు. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు కావున కార్తీకమాస చేసే అభిషేకముల వలన మంచి శుభఫలితములు కలుగును. ఈ కార్తీకమాసంలో చేసే అభిషేక, అర్చనల వలన సమస్తమైన నవగ్రహ దోషాలు, అపమృత్యు దోషాలు,శత్రు, రుణ, రోగ,బాధలు తొలిగిపోయి ఆయురారోగ్య ఐశ్వర్యము సిద్ధించి. శివానుగ్రహం కలుగును. కార్తీక మాసంలో నెలరోజుల అభిషేక సంకల్పము:- 300/- చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ప్రతిరోజు శ్రీ గౌరీ శంకర స్వామి వారికి లఘున్యాన పూర్వకరుద్రాభిషేకముజరుపబడునుసంప్రదిం చవ లసిన నెం.డి.లక్ష్మీనరసింహ శర్మ..8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు.8896123777.

# కార్తీకమాస ప్రారంభం

## శివకేశవుల కృపకు ప్రతీకమైన పవిత్ర దీపోత్సవం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21-నంద్యాల జిల్లా, మహానంది క్షేత్రంలో కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు మహానంది దేవస్థానంలో ఆకాశదీపం శాస్త్రోక్తంగా వెలిగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దీపగౌరి పూజ అనంతరం దీపాన్ని ధ్వజస్తంభం పై భాగాన వేలాడదీసే కార్యక్రమం జరిగింది .కార్తీకమాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనది. ఈ మాసంలో ఆకాశదీపం దర్శనం అత్యంత పుణ్యప్రదం. దీపాన్ని దర్శించడం ద్వారా చెడు భావనలు తొలగి సత్సంకల్పాలు కలుగుతాయని ఎ ౕ ు ం ా ణ ా ల ు చెబుతున్నారు. ఆకాశదీవం పితృదేవతలకు వైకుంఠమార్గాన్ని చూపుతుందనే విశ్వాసంతో ప్రతి ఆలయంలో ధ్వజస్తంభంపై దీపం వెలిగిస్తారు. ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనెతో వెలిగించే ఈ దీపం శివకేశవుల తేజస్సును జగత్తుకు ప్రసరిస్తుంది.దీపాన్ని దర్శించడం, నూనె పోయడం లేదా దీపం పక్కన నమస్కరించడం వలన అపార పుణ్యం లభిస్తుంది.కాబట్టి ప్రతి భక్తుడు నేడు మహానంది క్షేత్రంలోని ఆకాశదీప దర్శనం చేసి పుణ్యఫలాన్ని పొందగలరని ఆలయ అధికారులు తెలిపారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**